క్లుప్తంగా

ఘనంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

రొంపిచెర్ల: మండలంలోని పెద్ద మల్లెల పంచాయతీ నడింపల్లె చౌడేశ్వరీదేవి ఆలయ జ్యోతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. రాత్రి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారి సౌజన్యంతో నిర్వహించిన భక్తి గీతాల విభావరి, హరికథాగానం అలరించాయి. భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నూలు రెడ్డెప్ప, ప్రేమనందం, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో వ్యాధులు దూరం



బైరెడ్డిపల్లె : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చునని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లెలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ మాధవి, ఏఎస్‌ఎం సరస్వతి, మహిళా పోలీస్ తహసీన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్వో నయీమ్‌అలీ

పలమనేరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎఫ్‌ఆర్వో నయీమ్ అలీ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని వైట్‌సైట్ గార్డెన్‌లో లైఫ్ స్టైయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అక్కడి ప్లాస్టిక్ వ్యర్థాలు, బాటిళ్లను ఏరివేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా మానవాళికి, జంతువులకు కలిగే నష్టాలను వివరించారు. అటవీశాఖ సిబ్బంది, శ్రీవాణి డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీకి ఎంపికైన రొంపిచెర్ల పాఠశాల



రొంపిచెర్ల: పీఎంశ్రీ పథకానికి రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలను ఎంపిక అయినట్లు ఎంఈవో హసన్‌బాషా శుక్రవారం తెలిపారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నేరుగా పాఠశాలకు సంవత్సరానికి రూ.30 లక్షల వంతున ఐదేళ్ల పాటు ఇస్తుందన్నారు. పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు డిజిటల్ తరగతులు ఏర్పాటు, ఉపాధ్యాయ అభ్యసనా సామగ్రి, గ్రంథాలయం, తరగతి గదుల నిర్మాణం, క్రీడా మైదానాల అభివృద్ధి, అవసరమైన పరికరాలు, గ్రీన్ స్కూల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వంటి వాటికి ఈ నిధులను ఖర్చు చేస్తారని తెలిపారు.

పుంజుకుంటున్న టమాటా ధరలు


బైరెడ్డిపల్లె-వీకోట రహదారిలో కోత దశలో పంట


బైరెడ్డిపల్లె : ధరలు లేక నిరాశతో ఉన్న టమాటా రైతులకు ఊరట లభించింది. పంటపై పెట్టిన పెట్టుబడి కూడా చేతికందక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల కిందట కురిసిన రాళ్ల వర్షం, ఈదురు గాలులకు పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది. దీంతో ధరలు పుంజుకుంటున్నాయి. వారం రోజుల కిందట మొదటి రకం 15 కేజీల బాక్స్ రూ.70 పలకడంతో ఖర్చులు కూడా మిగల లేదని రైతులు వాపోయారు. ప్రస్తుతం అదే బాక్స్ ధర రూ.150 పలుకుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండడంతో పెట్టుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

సోమల: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ ఎస్‌ఏ గఫూర్ సాహెబ్ హెచ్చరించారు. శుక్రవారం నంజంపేట పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్ వద్ద పనులను పరిశీలించారు. గ్రామంలో మెరుగైన పారిశుద్ధ్యానికి సిబ్బంది కృషి చేయాలన్నారు.అనంతరం వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి సబితమ్మ పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మ కరుణించేలా..


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


గంగమ్మ శిరస్సు (ఫైల్)


ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

పలమనేరు జాతరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. వందేళ్ల చరిత్ర కలిగి.. భక్తుల కోర్కెలను తీర్చే పలమనేరులోని తిరుపతి గంగమ్మ జాతర ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరుగనుంది. ఆదివారం రాత్రి అమ్మవారి శిరస్సు మెరవణి, సోమవారం విశ్వరూప దర్శనం, మంగళవారం జలధి కార్యక్రమాలకు విచ్చేసే అశేష భక్తులను దృష్టిలో ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. గతనెల 30న చాటింపు నుంచి అక్క చెల్లెమ్మలు మారెమ్మ, గంగమ్మ ఆలయాల్లో నిత్యం ప్రత్యేకపూజలు, పొంగళ్లు, అంబళ్లు, నిత్యాన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకగా జరుగుతున్నాయి.

- రేపటి నుంచి పలమనేరు జాతర
- తొలి రోజు శిరస్సు మెరవణి, సోమవారం విశ్వరూప దర్శనం
- మూడు రాష్ట్రాల కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు
- భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ కమిటీ ముమ్మర ఏర్పాట్లు

పలమనేరు : పట్టణంలోని తిరుపతి గంగమ్మ ఆలయ వద్ద జాతర సందడి మొదలైంది. చాటింపు రోజు నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. పొంగళ్లు వండి నివేదిస్తున్నారు. జాతర నేపథ్యంలో శిరస్సు ఊరేగింపు ఆదివారం వేకువజాము వరకు జరగనుంది. అమ్మవారి పుట్టినిల్లుగా పిలిచే పాతపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి మెరవణి మొదలుకానుంది. జిల్లాలోనే తలపై అమ్మవారి శిరస్సును మోసేది ఇక్కడ మాత్రమే. స్థానికులే కాకుండా చుట్టుపక్కల రాష్ట్రాలనుంచి జాతరకు లక్షలాదిగా జనం విచ్చేస్తుంటారు. శిరస్సు మెరవణి సందర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా ఇనుప వలయాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ ఈసందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద సంగీత విభావరి, తమిళనాడు వారిచే భారీ బాణసంచా, ముంబయి, జంకోట, ఉరవకొండ వారిచే బుట్టబొమ్మలు దేవతా విగ్రహాల ప్రదర్శనలు జరగనున్నాయి. అదే విధంగా బళ్లారి డ్రమ్ముల మోత, పేపర్‌బ్లాస్టింగ్స్, నయ్యాండి నృత్యాలు తదితర కార్యక్రమాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. శిరస్సు మెరవణిలో లక్షలాది టెంకాయలను కొట్టడం ఇక్కడి ఆనవాయితీ.

ప్రతిష్టాత్మకంగా నిర్వహణ

ఆలయ కమిటీ సభ్యులు ఈ ఏడాది జాతర నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ఏ కమిటీ చేయని విధంగా అమ్మవారికి పసుపు నీటి సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంవద్ద భారీ ఎత్తున చలువ పందిళ్లు, లైటింగ్‌లు, హోర్డింగ్‌లు, భక్తులకు మంచినీటి ఏర్పాట్లు, ఆడిటోరియం వద్ద అభివృద్ధి పనులు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనాన్ని కల్పించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ కండల నరేష్, సభ్యులు రెడ్డెప్పరెడ్డి, మంజుల సుబ్రమణ్యం, కృష్ణవేణి గోవిందు, ప్రసాద్‌రెడ్డి, వేణు, గణేష్ తెలిపారు.


ఆలయం వద్ద చలువ పందిళ్లు

రెడ్డి సంఘం ప్రత్యేక పూజలు


ఆలయం వద్ద రెడ్డి సంఘం అన్నదానం

పలమనేరు గంగజాతరను పురస్కరించుకుని స్థానిక యోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెడ్డి సంఘం నేతలు శుక్రవారం గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సంప్రదాయ వస్త్రాలను ధరించి డప్పు వాయిద్యాలు, బళ్లారి డ్రమ్ములతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పూజలు చేపట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

శాంతిపురం: అబకలదొడ్డి వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐలోని కోర్సులకు మొదటి దఫా ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.నగేష్ తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని జూన్ 1 నుంచి 6వ తేది సాయంత్రంలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకోవాలని చెప్పారు. వెరిఫికేషన్ పూర్తయిన వారికి జూన్ 13 నుంచి చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రైతు భరోసాకు దరఖాస్తులు

పుంగనూరు: రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని ఏడీ శివకుమార్‌రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు నమోదు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. నూతనంగా నమోదు చేసుకునే వారితో పాటు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న వారి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. వీటిని సంబంధిత ఆర్‌బీకేల ద్వారా ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను పూర్తి చేసి జిల్లా అధికారుల పరిశీలనకు పంపుతామని పేర్కొన్నారు. రైతులు తమ దరఖాస్తులను సంబంధిత ఆర్‌బీకేల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

నేడు సీతారామ కల్యాణం

సదుం: మండలంలోని పొట్టింవారిపల్లె రామాలయంలో శనివారం శ్రీసీతారామ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గణపతి పూజ, మండపారాధన, హోమాలు, శాంతి కల్యాణం, కల్యాణోత్సవం ఉంటుందన్నారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

శ్రీవారి పాదక్షేత్రంలో..

మండలంలోని కొత్తపల్లె శ్రీవారిపాద క్షేత్రంలో శనివారం శ్రీవేంకటేశ్వర కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో హరికథ, పాటకచేరి ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగించనున్నట్లు చెప్పారు. అన్నదానం నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు


మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప, కన్వీనర్ బాగారెడ్డి

పెద్దపంజాణి: అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక టీడీపీ మాజీ మంత్రి అమరనాథరెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గురువారం మండలంలోని రాయలపేట గ్రామంలో జరిగిన 'ఇదేమి కర్మ' కార్యక్రమంలో మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే వెంకటేగౌడను విమర్శించడాన్ని ఖండించారు. పలమనేరు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణాలకు టెండర్లు నిర్వహించి పనులు ఆపేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ రోడ్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నా పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సుహేబ్ మాట్లాడుతూ రాయలపేట సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాలకు రూ.13.5 కోట్లు, అభివృద్ధి పనులకు దాదాపు రూ. 5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ అనుయాయులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాల లబ్ధి అందుతోందని వివరించారు. సింగిల్ విండో అధ్యక్షుడు సంపల్లి బాబు, వైస్ ఎంపీపీ జీడీబాబు, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వర్దారెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు జాతరకు పటిష్ట బందోబస్తు

చిత్తూరు అర్బన్: చిత్తూరు గంగజాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర శాఖాధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. నగరంలో 16, 17 తేదీల్లో జరిగే జాతరకు పోలీస్ సిబ్బందితోపాటు, అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జాతర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నిర్దేశిత ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. పిక్ పాకెటింగ్, ఆకతాయిల వెకిలి చేష్టల నివారణకు నిష్ణాతులైన క్రైమ్ బృందాలను నియమించామన్నారు. ట్యాగింగ్ సిస్టంను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. జాతర ప్రదేశాల్లో మైకులు అమర్చి చిత్తూరు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించి నిరంతరం పర్యవేక్షిస్తామని ఆయన పేర్కొన్నారు.

రేపు హనుమజ్జయంతి వేడుకలు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె భాస్కర్‌రెడ్డి కాలనీ కన్యమూల వినాయకస్వామి ఆలయంలో ఈనెల 14న హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. అభిషేకాలు, ఆకుపూజ చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

రేపు శ్రీరామ కోటి సంకీర్తన

రామకుప్పం: మండలంలోని సింగసముద్రం శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీహనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం అఖండ రామ జ్యోతి వెలిగింపు కార్యక్రమం, శ్రీరామకోటి సంకీర్తన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం మహా తులసి అర్చన, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆలయంలో రెండు రోజులు పాటు శ్రీరామ నామ జపం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం: మండల పరిధిలోని నడుమూరు మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరణి తెలిపారు. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు దాఖలుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. జూన్ 11వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపోలోని కార్గో పార్శిల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సుబ్బారావు తెలిపారు. స్థానిక డీఎం రామకృష్ణతో కలసి శుక్రవారం ఆయన బస్టాండులోని కార్గో పార్శిల్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కార్గో సేవల ద్వారా రాష్ట్రంలో గతేడాది పెట్టుబడి లేకుండా రూ.179 కోట్లు ఆర్టీసీకి ఆదాయం వచ్చిందన్నారు. ఇలాంటి సేవల ద్వారా ప్రజలకు సౌకర్యంతో పాటు ఆర్టీసీకి ఆదాయం కూడా లభిస్తుందని తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పెద్దపంజాణి: బట్టందొడ్డి పంచాయతీ జంగాలపల్లె సమీపంలోని చెరువులో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి పుంగనూరు కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

జర్నలిస్ట్ మృతి


రామచంద్రారెడ్డి(ఫైల్)

చౌడేపల్లె: తెల్లనీళ్లపల్లెకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఆర్.రామచంద్రారెడ్డి(69) శుక్రవారం మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివిధ పత్రికల్లో ఆయన జర్నలిస్టుగా పనిచేశారు. ఆయన మృతికి పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు సంతాపాన్ని తెలియజేశారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి


గుడుపల్లె : జ్యోతి ప్రజ్వల చేస్తున్న చెన్న బసవపాటిల్


కల్లూరులో నర్సులకు సన్మానం

గుడుపల్లె: నర్సుల సేవలు వెలకట్టలేనివని పీఈఎస్ సూపరింటిండెంట్ చెన్న బసవపాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం పీఈఎస్ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మానవ సేవే మాధవ సేవగా నర్సులు ఎల్లావేళల ప్రజా సేవలో నిమగ్నమై ఉంటారన్నారు. చికిత్స పొందుతున్న రోగులకు ధైర్యం చెప్పి వ్యాధి నయం అయ్యేంత వరకు అండగా నిలి చేది నర్సులు మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం యువత నర్సింగ్ కోర్సులు చేసి దేశ విదేశాలలో రోగులకు సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మోహన్‌రూప, సంగీత, విమల, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సులకు సన్మానం

పులిచెర్ల(కల్లూరు):అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా కల్లూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నర్సులను ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ షకూర్, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి యుగంధర్, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

18 లోపు రైతు భరోసాకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సుధాకర్

సోమల: వైఎస్సార్ రైతు భరోసా లబ్ధి పొందాలంటే కొత్తగా పాసు పుస్తకాలు తీసుకున్న రైతులు ఈనెల 18వ తేదీ లోపు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆర్బీకే చైర్మన్ వెంకటేష్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రతి రైతు తమకున్న భూ విస్తీర్ణంలో కొంత మేర రాగి, కొర్రలు సాగు చేయాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్,నాగేశ్వర రావు మాట్లాడుతూ అడవి పందుల బెడదతో నష్టపోతున్న రైతుల విజ్ఞప్తి మేరకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని కోరారు. పట్టు పరిశ్రమల శాఖ అధికారి అనిల్ మాట్లాడుతూ మల్బరీ సాగుకు, పట్టు పురుగులు పెంపకం షెడ్ల నిర్మాణానికి రాయితీ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాధికారి చందన ప్రియ మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, వైస్ ఎంపీపీ సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

కమనీయం.. కోనేటిరాయుని కల్యాణం


గంగవరం: విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు


గుడుపల్లె: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీశ్రీదేవి,భూదేవి సమేత కోనేటిరాయస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. కంకణధారణ, మాంగళ్య పూజ, వాస్తు హోమం, వస్త్ర సమర్పణ, యజ్ఞోపవీత ధారణ అనంతరం వేదోక్తంగా కల్యాణం నిర్వహించారు. మహా మంగళ హారతులు సమర్పించారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సంకీర్తనల విభావరి జరిగింది. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు కల్యాణాన్ని వీక్షించి తరించారు.

నేత్రపర్వంగా సీతారామ కల్యాణం

గుడుపల్లె: మండలంలోని తిమ్మనాయనపల్లె శ్రీవీరాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం శ్రీసీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు జరిగాయి. తదుపరి సీతారాముల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చి అలంకరించారు. హోమ పూజల అనంతరం వేదోక్తంగా మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు విశేషంగా విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయావరణలో రామకోటి నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నయనానందకరంగా సాగింది.

అల్లూరి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ


భూమి పూజలో పాల్గొన్న క్షత్రియ సంఘ నాయకులు

పుంగనూరు: అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రతిష్టకు క్షత్రియ సంఘ నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. పట్టణంలోని చిత్తూరు బైపాస్ సర్కిల్ వద్ద విగ్రహ ప్రతిష్టకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుమతి ఇచ్చారు. ఈమేరకు క్షత్రియ సంఘ నాయకులు భక్తవత్సలరాజు, దామోదర్‌రాజు, వెంకట్రమణరాజు ఆధ్వర్యంలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. భక్తవత్సలరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని తెలిపారు. ఆయన సేవలకు గుర్తుగా ఈకార్యక్రమం చేపట్టామన్నారు. విగ్రహ ప్రతిష్టకు స్థలాన్ని కేటాయించిన మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సంఘ నాయకులు రెడ్డెప్పరాజు, నవీన్‌కుమార్‌రాజు, సతీష్‌కుమార్‌రాజు, లక్ష్మణ్‌రాజు, చంద్రశేఖర్‌రాజు, పట్టాభిరామరాజు, మల్లికార్జునరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రహదారి విస్తరణ పనులు


బెల్లంమడుగు వద్ద విస్తరించిన రహదారి

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె-పుంగనూరు రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి గుంతల రహదారితో పాటు సింగిల్ రోడ్డుగా ఉన్న బైరెడ్డిపల్లె-పుంగనూరు రోడ్డు విస్తరణకు నోచుకుంది. గత పాలకులు రహదారి ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడం తప్పా చేసిందేమీ లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ స్పందించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి రహదారి ఏర్పాటుకు కృషి చేశారు. రహదారి పనులు సగభాగం పైగా పూర్తి కావడంతో ప్రయాణికుల కష్టాలు తప్పాయి. కుప్పం, శాంతిపురం, వికోట, బైరెడ్డిపల్లె మండలాల మీదుగా వచ్చే ప్రయాణికులు గతంలో పుంగనూరు, మదనపల్లె, కడపకు వెళ్లాలంటే పలమనేరు మీదుగా వెళ్లేవారు. ప్రస్తుతం రహదారి పనులు సగభాగం పైగా పూర్తి కావడంతో బైరెడ్డిపల్లె మీదుగా వెళ్తున్నారు. దీంతో కిలోమీటర్లు తగ్గడంతో పాటు ప్రయాణానికి సౌకర్యంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.